సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 24 । నవంబర్ । 2024

నేడు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష
ఎదులాపురం: 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24 పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల భుక్తాపూర్, విద్యానగర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల నం.2, బాలక్ మందిర్‌లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

6, 7 తేదీల్లో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు
ఎదులాపురం: వచ్చే నెల 6, 7 తేదీల్లో నిర్వహించనున్న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కె.రఘురమణను 9440060288 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
27.0/12.0

వాతావరణం
రాత్రి వేళలో చలితీవ్రత పెరగనుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

పింఛన్ హామీ నిలబెట్టుకోవాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇస్తామన్న హామీని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే నెరవేర్చాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సూర్యవంశీ సుజాత డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచుతామని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 26న నిజాం కళాశాలలో నిర్వహించనున్న సభకు దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, వితంతువులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇందులో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్, వీహెచ్‌పీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రేంరాజ్, తుమ్మల రాజు, బాలాజీ, నందేవ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్

కై లాస్‌నగర్: పాఠశాలలు, వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో ఎస్సీ, బీసీ సంక్షేమాధికారులు సునీత, రాజలింగు, డీఈవో ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

ప్రధానిపై నమ్మకంతోనే బీజేపీకి పట్టం


మిఠాయిలు తినిపించుకుంటున్న ఎమ్మెల్యే శంకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్

ఆదిలాబాద్: ప్రధాని నరేంద్ర మోదీపై నమ్మకంతోనే మహారాష్ట్ర ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి విజయం దిశగా సాగుతున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు ప్రచారం చేసినా, వారిని ప్రజలు నమ్మలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, లాలామున్నా, దినేష్ మటోలియా, కృష్ణయాదవ్, రాజేశ్, శ్రీనివాస్, రఘుపతి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్ అతిగా వాడొద్దు


ర్యాలీలో పాల్గొన్న రిమ్స్ డైరెక్టర్, మెడికోలు

ఆదిలాబాద్‌టౌన్: యాంటీ బయాటిక్స్ మాత్రలను అతిగా వాడితే అనర్థాలు తప్పవని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. యాంటీ బయాటిక్స్ ద్వారా కలిగే అనర్థాలపై ప్రజలను చైతన్యపరిచేలా శనివారం రిమ్స్ నుంచి ఇందిరాప్రియదర్శిని స్టేడియం వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యాంటీ బయాటిక్స్ ఎక్కువగా వాడితే దుష్పరిణామాలు ఉంటాయని అన్నారు. వైద్యుల సూచన లేనిదే వాడొద్దన్నారు. ఇందులో రిమ్స్ మెడికోలు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ మదిలో.. ఆ కానిస్టేబుల్

- ఐజీ రమేశ్ జ్ఞాపకాల్లో ఏఎస్సై బాబర్
- 27 ఏళ్ల క్రితం ప్రొబేషనరీ శిక్షణ అనుభవాలు
- ఆదిలాబాద్‌కు విచ్చేసిన ఉన్నతాధికారి
- 'దీక్షాంత్'లో నాటి రోజులను గుర్తు చేసిన ఆఫీసర్


ఆదిలాబాద్ పోలీసు క్లబ్‌లో ఐజీ రమేశ్‌తో బాబర్ మాటామంతి

సండే స్పెషల్

కొన్ని జ్ఞాపకాలు మదిలో ఎప్పటికీ నిలిచిపోతాయి. హోదా పెరిగి ఏ స్థాయిలో ఉన్నప్పటికీ కొందరు వాటిని మరిచిపోరు. కాలం ఎంత పరుగు తీసినా అవి మనస్సులోంచి చెదిరిపోవు. ఆ ప్రాంతానికి తిరిగి వెళ్లినప్పుడు పాత వ్యక్తులు తారసపడినప్పుడు ఆ అనుభూతులు మరోసారి హృదయాన్ని స్పృశిస్తాయి. విధి నిర్వహణలో భాగంగా ఇటీవల ఆదిలాబాద్‌కు విచ్చేసిన తెలంగాణ పీఅండ్‌ఎల్ ఐజీ ఎం.రమేశ్ జిల్లాతో గతంలో తనకున్న అనుబంధం, ఆ క్రమంలో తనతో ఎక్కువగా గడిపిన ఓ ఉద్యోగితో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.
– సాక్షి,ఆదిలాబాద్

సరిగ్గా ఇరవై ఏడేళ్ల క్రితం.. అంటే 1997లో ఎం.రమేశ్ హైదరాబాద్ రాజ్‌బహదూర్ వెంకట్రాంరెడ్డి పోలీసు అకాడమీ నుంచి ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. మొదట డీఎస్పీ హోదాలో ప్రొబేషనరీ శిక్షణ తీసుకోవాలి. అది ఎలా ఉంటుందంటే.. కానిస్టేబుల్ నుంచి ఎస్సై, సీఐల బాధ్యతలు ఎలా ఉంటాయి.. ఎలా నిర్వర్తిస్తారు.. కేసుల విచారణలో ఎలా ముందుకు వెళ్లారు.. అనే అంశాలను ఆ పోస్టుల్లో పరకాయ ప్రవేశం చేసినట్లు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఐపీఎస్ రమేశ్‌ను ఈ ప్రొబేషనరీలో భాగంగా పోలీసు శాఖ ఆదిలాబాద్ వన్‌టౌన్‌కు పంపించింది. ఇక్కడ కానిస్టేబుళ్ల విధులు తెలుసుకునే విషయంలో అప్పుడు వన్‌టౌన్‌లో కానిస్టేబుల్‌గా ఉన్న బాబర్ మీర్జా బేగ్‌ను ఐపీఎస్‌కు అటాచ్ చేశారు. ఆరు నెలల పాటు జిల్లాలోనే ఉన్న రమేశ్‌తో బాబర్ వెన్నంటి ఉన్నాడు. శిక్షణలో సెంట్రీ డ్యూటీ, ఏదైనా యాక్సిడెంట్ జరిగి ఆస్పత్రికి క్షతగాత్రులు వస్తే విధులు ఎలా నిర్వర్తించడం, దర్యాప్తు అధికారికి కానిస్టేబుల్ ఎలా సహకరించాలని, పంచనామా రాయడం, చిన్న చిన్న నేరాలు జరిగినప్పుడు దర్యాప్తు అధికారితో వెళ్లి సాక్షుల వాంగ్మూలం సేకరించడం.. అటు పై ఎస్సై, సీఐ విధుల నిర్వహణ విషయంలోనూ అనుభవం పొందారు.

పరేడ్ వేదికపై నుంచి..
కొత్త కానిస్టేబుళ్లను ఉద్దేశించి ఐజీ రమేశ్ దీక్షాంత్ పరేడ్ వేదికపై నుంచి మాట్లాడారు. 'ఆదిలాబాద్ జిల్లా అంటే నాకెంతో ఇష్టం.. ఎందుకంటే నా మొదటి అడుగులు పోలీసు శాఖలో ఇక్కడి నుంచే మొదలయ్యాయి.. ఆ రోజు ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో చక్కటి అనుభవం గడించాను.. ఆ సమయంలో కానిస్టేబుల్ బాబర్ నాకు అటాచ్ గా విధులు నిర్వర్తించాడు.. ఆ సమయంలో కేసుల దర్యాప్తులో ఎంతో అనుభవం గడించాను.. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న మీకు కూడా ఇలాంటి మంచి జ్ఞాపకాలు, అనుభూతులు నిలువాలి'.



దీక్షాంత్ పరేడ్ వేదికపై బాబర్ విషయం ప్రస్తావిస్తున్న ఐజీ రమేశ్

సార్ వస్తున్నారని..
గత గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో ట్రెయినింగ్ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లకు పాసింగ్ అవుట్ కార్యక్రమంలో భాగంగా దీక్షాంత్ పరేడ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐజీ రమేశ్ వస్తున్నారని తెలిసిన వారు ముందే బాబర్‌కు చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన బాబర్ ప్రస్తుతం కుమురం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్‌లో ఏఎస్సైగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. ఐజీ రమేశ్ వస్తున్నారని, తనకు సార్‌తో ఉన్న అనుబంధం దృష్ట్యా కలుసుకునేందుకు అనుమతి ఇవ్వాలని జైనూర్ ఎస్సై సాగర్‌ను అనుమతి కోరి గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. పోలీసు క్లబ్‌లో ఆగిన ఐజీని నేరుగా కలిశాడు. ఆ సమయంలో ఐజీ ఆ రోజులను గుర్తు చేసుకున్నారు. అంతే కాకుండా అప్పట్లో ఆదిలాబాద్ టౌన్ ఎస్‌హెచ్‌వోగా ఉన్న సురేందర్‌రెడ్డి, సీఐ సాయిలు ప్రస్తుతం వేరే ప్రాంతాల్లో ఉండగా ఐజీ వీడియో కాన్ఫరెన్స్‌లో వారితో మాట్లాడారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

సార్ తన్మయం చెందారు..

పోలీసు క్లబ్‌లో ఐజీ రమేశ్ సార్‌ను కలిసినప్పుడు ఆయన తన్మయం చెందారు. తన పక్కనున్న వారితో నా గురించి చెప్పారు. 'ఆసిఫాబాద్ నుంచి నన్ను కలిసేందుకు వచ్చాడని, ప్రొబేషనరీ శిక్షణలో నాకు అటాచ్‌గా ఉన్నాడని' అన్నారు.
– బాబర్, ఏఎస్సై

దివ్యాంగులను ప్రోత్సహించాలి


జెండా ఊపి పోటీని ప్రారంభిస్తున్న ఎంపీ

ఆదిలాబాద్: దివ్యాంగులను అన్ని విధాలుగా ప్రోత్సహించాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం నిర్వహించిన దివ్యాంగుల జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులకు ఆసక్తి ఉన్న అంశంలో ప్రోత్సాహం అందిస్తే సకలాంగులకు దీటుగా రాణిస్తారన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సమస్యలను హ్యాండీక్యాప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఇమ్రాన్ ఎంపీకి విన్నవించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో సబిత, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఏసీడీపీవో మిల్కా, రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు రఘుపతి, పెటా ప్రధాన కార్యదర్శి స్వామి, రాజేశ్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, కబీర్ దాస్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనంతరం స్టేడియంలో గల మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ ఫీల్డ్‌ను ఎంపీ నగేశ్ పరిశీలించారు. ఆస్ట్రో టర్ఫ్ హాకీ కోర్టు, సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. వారం రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట రైల్వే బోర్డుమెంబర్ రఘుపతి, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, డివైఎస్‌వో వెంకటేశ్వర్లు, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రాష్ట్రపాల్, కబీర్‌దాస్, తుకారాం, నర్సయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు యథావిధిగా ప్రజావాణి
కై లాస్‌నగర్: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 25న యథావిధిగా ఉంటుందని కలెక్టర్ రాజర్షిషా ప్రకటనలో తెలిపారు. గత రెండు వారాలుగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

'ఎమ్మెల్సీ' ముసాయిదా జాబితా విడుదల

- జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 13,405
- ఉపాధ్యాయ ఓటర్లు 1401
- 9 వరకు అభ్యంతరాల స్వీకరణ



జిల్లాలోని మండలి ఓటర్ల వివరాలు

	రెవెన్యూడివిజన్	పురుషులు	మహిళలు	మొత్తం
పట్టభద్రులు	ఉట్నూర్	1,270	519	1,789
	ఆదిలాబాద్	8,038	3,578	11,616
టీచర్లు	ఉట్నూర్	163	71	234
	ఆదిలాబాద్	812	355	1,167

కై లాస్‌నగర్: త్వరలో నిర్వహించనున్న మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో ఈసీ (ఎలక్షన్ కమిషన్) ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్వహిస్తోంది. ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన జిల్లా ముసాయిదా ఓటరు జాబితాను అదనపు కలెక్టర్ శ్యామలాదేవి శనివారం విడుదల చేశారు. జిల్లాలో పట్టభద్ర ఓటర్లు 13,405 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,308 మంది ఉండగా మహిళా ఓటర్లు 4,097 మంది ఉన్నారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు జిల్లా వ్యాప్తంగా 1,401 మంది ఉండగా అందులో పురుషులు 975 మంది , మహిళలు 426 మంది ఉన్నారు. ముసాయిదా జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కార్యాలయం, ఉట్నూర్ సబ్‌కలెక్టర్ కార్యాలయం, ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయంతో పాటు జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై అందుబాటులో ఉంచారు. పట్టభద్రుల ఓటర్లతో పోల్చితే ఉపాధ్యాయ ఓటర్ల నమోదు తక్కువగా ఉండగా, మహిళా ఓటర్ల నమోదు మరీ తక్కువగా ఉండటం గమనార్హం.

డిసెంబర్ 9వరకు అభ్యంతరాల స్వీకరణ
శనివారం ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాపై ఈ నెల 23 నుంచి డిసెంబర్ 9వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. నిర్ణీత గడువులోగా దీనిపై అందిన అభ్యంతరాలు, ఓటర్ క్లెయిమ్స్‌ను డిసెంబర్ 25లోగా పరిష్కరించి డిసెంబర్ 30న తుది జాబితాను ప్రకటించనున్నారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం
ఇప్పటి వరకు మండలి ఓటరుగా నమోదు చేసుకోలేనటువంటి ఉపాధ్యాయులు, పట్టభద్రులకు మరో అవకాశం కల్పించారు. డిసెంబర్ 9వరకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లోనూ ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవచ్చు. పట్టభద్రులు ఫారం-18 ద్వారా, ఉపాధ్యాయులు ఫారం 19 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

గజగజ

- జిల్లాను వణికిస్తున్న చలి
- పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- శనివారం 10.8 డిగ్రీ సెల్సియస్ నమోదు


జిల్లా కేంద్రంలో చలిమంట కాగుతున్న జనం

ఆదిలాబాద్‌టౌన్: భిన్నమైన వాతావరణానికి నెలవైన జిల్లాను చలి పులి వణికిస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతున్నాయి. రెండు మూడు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం, శీతల గాలులు తోడవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. వేకువజామున బయటకు వచ్చే పాల వ్యాపారులు, పేపర్‌బాయ్‌లు, పారిశుద్ధ్య కార్మికులు చలికి వణికిపోతున్నారు. ఏజెన్సీ, అటవీ ప్రాంతాల్లో ఈ ప్రభావం మరింత అధికం. నేరడిగొండ మండలంలో శనివారం 10.8 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు చిన్నారులు, వృద్ధులు, అస్తమా రోగులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

స్వెట్టర్లకు పెరిగిన గిరాకీ..
చలి తీవ్రత పెరగడంతో ఆదిలాబాద్ పట్టణంతో పాటు ఆయా మండల కేంద్రాల్లో వెలిసిన స్వెట్టర్ల దుకాణాల్లో గిరాకీ పెరిగింది. జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌక్, రాంలీలా మైదానం, పంజాబ్ చౌక్ తదితర ప్రాంతాల్లో దుకాణాలు వెలిశాయి. అలాగే ఆయా రాష్ట్రాల నుంచి వ్యాపారులు గ్రామాల్లో తిరుగుతూ స్వెట్టర్లు, బ్లాంకెట్లను విక్రయిస్తున్నారు. దీంతో ఉన్ని దుస్తుల వ్యాపారం జోరందుకుంది.

పెరిగిన చలి
జిల్లాలోని ఆయా మండలాల్లో చలి తీవ్రత పెరిగింది. నేరడిగొండలో కనిష్ట ఉష్ణోగ్రత 10.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అలాగే బజార్‌హత్నూర్‌లో 11, బోథ్ మండలంలోని పొచ్చెరలో 11.4, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పల్‌దరిలో 11.8, బోథ్ మండలం సోనాలలో 11.9, బేలలో 11.7, భీంపూర్ మండలంలోని అర్లి-టిలో 11.8, ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో 12.5, జైనథ్‌లో 12.7, ఇంద్రవెల్లిలోని హీరాపూర్‌లో 12.8, బేలలోని చెప్రాలలో 12.4 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఆదిలాబాద్‌టౌన్: క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జైనథ్ మండల కేంద్రంలో రూ.3.58 కోట్ల వ్యయంతో చేపట్టిన మినీ స్టేడియం నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నాయని తెలిపారు. అనంతరం మండలంలోని అకుర్ల గ్రామానికి మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. రైతులు వ్యవసాయ భూములకు వెళ్లేందుకు వీలుగా రూ.75 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించామన్నారు. ఇందులో నాయకులు రాందాస్, రాకేశ్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రతాప్, రమేశ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కళాశాల తనిఖీ
గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో రవీందర్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, బోధన తరగతుల నిర్వహణపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి. శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శా తం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా చదవాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థి ప్రతిభ


బహుమతి అందుకుంటున్న విఘ్నేష్

ఎదులాపురం: ఈనెల 19 నుంచి 22వరకు హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర కళాశాలల క్రీడా పోటీల్లో ఆదిలాబాద్ విద్యార్థి విఘ్నేష్ ప్రతిభ కనబరిచాడు. చెస్‌లో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నాడు. కళాశాల అసోసియేట్ డీన్, సిబ్బంది అభినందించారు.

ఆయిల్‌పాం సాగు లాభదాయకం

తాంసి: ఆయిల్‌పాం సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి సుధాకర్ అన్నారు. మండలంలోని హస్నాపూర్, వడ్డాడి గ్రామాల్లో ఆయిల్‌పాం తోటలను శనివారం ఆయన పరిశీలించారు. కీటకాల ద్వారా పరపరాగ సంపర్కం చేసే విధానంపై క్షేత్రస్థాయిలో కంపెనీ ప్రతినిధులతో కలిసి శిక్షణ ఇచ్చారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో కంపెనీ మేనేజర్ మల్లేశ్వర్‌రావు, ఏరియా మేనేజర్ శ్రీకాంత్, క్లస్టర్ ఆఫీసర్ రమేశ్, రైతులు పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని ఖోడద్, ఉండం గ్రామాల రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పాం పంటలను సుధాకర్ పరిశీలించారు.


అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానవన అధికారి

గెజిటెడ్ అధికారుల జిల్లా కార్యవర్గం


నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న శ్రీనివాసరావు

కైలాస్‌నగర్: గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ అతిథులుగా హాజరయ్యారు. వారి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.శివకుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా జి.రాజేషుడు, ఎస్.వామన్‌రావు, పి.అరుణ, కార్యదర్శిగా రాథోడ్ రామారావు, జాయింట్ సెక్రెటరీలుగా కె.అనిల్, పి.నరేష్, జి.వినూత్న, కోశాధికారిగా శ్రీనివాస్ రొడ్డ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కె.మల్లేశ్, ప్రచార కార్యదర్శిగా ఆర్.సంతోష్,ఆఫీస్ సెక్రెటరీగా ఆడె ధర్మేందర్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రెటరీగా వై.శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా భగత్ రమేశ్, చంద్రశేఖర్, సరోజ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించి నియామకపత్రాలు అందజేశారు. వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇందులో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక


మౌనిక

చెన్నూర్: పట్టణంలోని బే తాళవాడకు చెందిన గడ్డం మౌనిక ఇటీవల వెలువడిన ఫలితాల్లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై ంది. ఎంఎస్సీ మ్యాథ్స్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసిన ఆమె జేఎల్ పరీక్ష రాసింది. ఫలితాల్లో ఎంపికకావడంపై తల్లిదండ్రులు గడ్డం శ్రీవాణి –గోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

27 నుంచి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ లీగ్ పోటీలు

రామకృష్ణాపూర్: ఈనెల 27 నుంచి 29 వరకు పట్టణంలోని ఠాగూర్ స్టేడియం, మందమర్రి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్స్‌లో జిల్లా ఫుట్‌బాల్ లీగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పూల్ ఏ, పూల్ బీలో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి మొత్తం తొమ్మిది జట్లు లీగ్ మ్యాచ్‌ల్లో తలపడనున్నాయని తెలిపారు. ఈనెల 29న మంచిర్యాల వివేకవర్ధని డిగ్రీ కాలేజీలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని కోరారు.

అట్టహాసంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు


పరుగు పందెం పోటీలో క్రీడాకారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట మౌంట్ కార్మల్ పాఠశాలలో శనివారం జిల్లా అథ్లెటిక్స్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమైంది. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాంబమూర్తి, కార్యదర్శి ఈ.మారయ్య, మౌంట్ కార్మల్ పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ ఆల్ఫీ ఈ పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పరుగు పందెం, షార్ట్‌పుట్, లాంగ్ జంప్ అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలతోపాటు ప్రోత్సాహక సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు జీవరత్నం, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.నరేందర్, పీఈటీ రాంవేణు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో ప్రైవేట్ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు..మహారాష్ట్ర వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు శనివారం సొనాల బస్టాండ్ సమీపంలో గ్రామానికి చెందిన తుల గంగయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆయన్ను స్థానికులు బోథ్ సీహెచ్‌సీ ఆస్పత్రికి అటు నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. బస్సును స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, దొడ్డిదారిన ప్రైవేట్ బస్సులు మహారాష్ట్ర నుంచి బెంగుళూరుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

గుప్తనిధుల తవ్వకాలకు యత్నం


పూజలు చేసిన దృశ్యం

బోథ్: గుప్తనిధుల కోసం కొందరు తవ్వకాలు యత్నించారు. మండలంలోని సాకెర శివారులో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. సాకెర శివారు గల పురాతన గడి వద్ద గుప్తనిధుల తవ్వకాలు జరిపే చోటు వద్ద కొందరు నిమ్మకాయలు, కొబ్బరికాయలు, పసుపుతో పూజలు చేశారు. ఈ తతంగం ఓ వ్యక్తి ద్వారా బోథ్ పోలీసులకు చేరింది. కాగా గుప్తనిధుల కోసం తవ్వడానికి సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులు వస్తున్నారని తెలియడంతో సదరు వ్యక్తులు పారిపోయారు. అయితే మహారాష్ట్రకు చెందినవారే ఉంటారని భావిస్తున్నారు. మండలానికి చెందిన వ్యక్తి ద్వారానే ఈ ప్రణాళిక చేశారని తెలుస్తోంది. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దేశసేవకు మేముసైతం..

- డిఫెన్స్ రంగంపై కేడెట్ల ఆసక్తి
- 150 మందికి పైగా ఆర్మీ కొలువులు
- నేడు ఎన్‌సీసీ దినోత్సవం


మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: దేశంలో నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) డే నవంబర్ నాల్గవ ఆదివారం రోజున జరుపుకుంటారు. క్రమశిక్షణ కలిగిన యువతను దేశభక్తి పౌరులుగా తీర్చిదిద్దడమే దీని లక్ష్యం. కేడెట్లలో కర్తవ్య భావం, నిస్వార్థ సేవ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే దీని ఉద్దేశం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కేడెట్లు త్రివిధ దళాల్లో కొలువులు సాధించి దేశ సేవలో పాల్గొంటున్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు సాధించేలా శ్రమిస్తున్నారు. ఎన్‌సీసీలో సీ సర్టిఫికెట్ సాధించి డిఫెన్స్ రంగంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎన్‌సీసీ డే సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు 'సాక్షి'తో ముచ్చటించారు.

క్రమశిక్షణకు ఎన్‌సీసీ

దేశవ్యాప్తంగా యువత క్రమశిక్షణకు ఎన్‌సీసీకి పేరుంది. కర్తవ్యం, నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణ, నైతిక విలువలతో వారి సర్వతోముఖాభివృద్ధికి అవకాశాలను అందిస్తోంది. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవలు, తదితర శిక్షణపై కేడెట్లను తయారు చేస్తోంది. ఇందులో భాగంగా మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1984లో ఎన్‌సీసీ 32(ఏ)బీఎన్ ఆదిలాబాద్ యూనిట్ బెటాలియన్‌గా ఏర్పాటైంది. ప్రారంభంలో అవగాహన లేకపోవడంతో తక్కువ మంది ఎన్‌సీసీలో చేరారు. రానురాను మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి ఎన్‌సీసీలో శిక్షణ పొందారు. వేలాది మంది ఆర్మీ, నేవీ, బీఎస్‌ఎఫ్, సీఆర్పీఎఫ్ వివిధ రక్షణ శాఖల్లో సుమారు 150 మందికి పైగా ఉద్యోగాల్లో చేరారు.

ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశం

ఎన్‌సీసీ 1948 జూలై 16న ఐక్యత క్రమశిక్షణ అనే నినాదంతో వచ్చింది. ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులకు ఏ,బీ,సీ సర్టిఫికెట్లు అందజేస్తారు. శిక్షణలో రాష్ట్రాలు, జిల్లాల్లో క్యాంపులు నిర్వహిస్తారు. ప్రతిభ కనబర్చినవారికి ర్యాంక్‌లు అందిస్తారు. ఆర్‌డీసీ(రిపబ్లిక్ డే క్యాంపు) నిర్వహిస్తారు. ఏటా జనవరి 15న ఢిల్లీలో జరిగే పరేడ్‌కు ఎంపిక చేస్తారు. ఆర్‌డీ క్యాంప్‌నకు సెలెక్ట్ అయినవారికి డ్రిల్, లైన ఫ్లాగ్‌ఏరియా, కల్చరల్ ప్రోగ్రాం, బెస్ట్ కేడెట్ పోటీలు ఉంటాయి. రాష్ట్రాలకు చెందిన వారు పోటీ పడుతుంటారు. కార్యక్రమానికి రాష్ట్రపతి, ప్రధాని, మంత్రులు, ఢిల్లీ సీఎం, త్రివిధ దళాధిపతులు హాజరవుతారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన వారికి ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. రక్షణ దళంలో ఉద్యోగం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటుంది.

డిఫెన్స్ ఉద్యోగాల్లో రిజర్వేషన్



ఎన్‌సీసీలో శిక్షణ పొందినవారికి డిఫెన్స్ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సీఐఎస్‌ఎఫ్, ఆర్మీ ఉద్యోగాలు సాధించారు.
– జాడి మహేశ్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఆఫీసర్

దేశ సేవే లక్ష్యంగా



దేశ సేవచేయడమే తన లక్ష్యం. నేవీ ఆఫీసర్ ఉద్యోగం సాధించాలనేది తన చిన్నప్పటి కల. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసి ఉద్యోగం సాధిస్తాను. ఇప్పటి నుంచే ప్రిపేర్ అవుతున్నాను.
– బి.సంతోష్, సీనియర్ ఎన్‌సీసీ కేడెట్

నేవీ ఆకాడమీలో చేరాలని..



ఇండియన్ నేవీ అకాడమీలో చేరాలని ఉంది. నేవీ ఆఫీసర్ ఉద్యోగం సాధించి తన కల సాకారం చేసుకుంటాను. కళాశాలలో చేరి ఎన్‌సీసీ శిక్షణ పూర్తిచేస్తాను. డిఫెన్స్ రంగంలో ఉద్యోగం సాధించేలా కృషిచేస్తాను.
– ఎం.అజయ్‌గౌడ్, సీనియర్ ఎన్‌సీసీ కేడెట్

సేవాభావం పెరిగింది



ఎన్‌సీసీలో చేరిన తర్వాత సేవాభావం, క్రమశిక్షణ పెరిగింది. విద్యతోపాటు ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటున్నాను. ఫైరింగ్, పరేడ్ పోలీస్ ఉద్యోగాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతాయి. ఎస్సై ఉద్యోగం సాధిస్తా. ఎన్‌సీసీ.. భవిష్యత్తుకు బాటలు వేసుకునే మార్గం.
– ఏ,అజయ్, జూనియర్ ఎన్‌సీసీ కేడెట్

ఆర్మీ ఆఫీసర్‌నవుతా



మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తర్వాత ఎన్‌సీసీలో చేరాను. డిగ్రీతోపాటు ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ సాధించాక ఆర్మీ ఆఫీసర్‌నవుతా. చిన్ననాటి నుంచి పోలీస్ ఉద్యోగం ఇష్టం. కరాటేలో ప్రావీణ్యం ఉంది.
– శ్రీహిత, ఎన్‌సీసీ కేడెట్

ఆత్మస్థైర్యం పెరిగింది



ఎన్‌సీసీలో చేరిన తర్వాత ఆత్మస్థైర్యం పెరిగింది. ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటే ఆర్మీ, డిఫెన్స్‌ల్లో ఉద్యోగాలు సులువుగా సాధించవచ్చు. గన్ ఫైరింగ్, పరేడ్, ఫిజికల్ ట్రైనింగ్ తదితర ఉద్యోగాలకు ఎంతో ఉపయోగపడుతాయి. ఆర్మీలో ఉద్యోగం సాధించే దిశగా ముందుకెళ్తున్నాను.
– సౌమ్య, ఎన్‌సీసీ కేడెట్

చెరువుల సందర్శన


బృందానికి సూచనలు చేస్తున్న అధికారులు

మామడ: మండలంలోని దిమ్మదుర్తి అటవీక్షేత్రం పరిధిలోని తుర్కం, యెంగన్న చెరువులను హైదరాబాద్ నుంచి ఐటీకోస్ బృందం పర్యాటకులు శనివారం సందర్శించారు. ఆదివారం వరకు వీరు ఇక్కడే ఉండనున్నారు. అటవీ అధికారులు వారి కోసం శిబిరం ఏర్పాటు చేశారు. ఇక్కడకు వచ్చే వలస పక్షులను తిలకించడానికి, అందాలను తమ కెమెరాల్లో బంధించనున్నారు. అటవీ అధికారులు బృందానికి సూచనలు చేశారు. పీసీసీఎఫ్ వైల్డ్‌లైఫ్ ఎలూసింగ్ మేరు, సీసీఎఫ్ శరవణన్, డీఎఫ్ఓ నాగినిబాను, ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

లారీ బోల్తా


బోల్తాపడిన లారీ

భైంసారూరల్: మండలంలోని మాటేగాం వంతెనపై శనివారం వేకువజాము లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్ నుంచి విజయవాడకు టైల్స్ లోడ్‌తో లారీ వెళ్తోంది. భైంసా–నిర్మల్ జాతీయ రహదారి మాటేగాం వంతెనపై అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీడ్రైవర్ ఉపేందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న భైంసా రూరల్ సీఐ నైలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

నాలుగు రోజులుగా నరకయాతన

- గూడెం వంతెన కింద వృద్ధుడిని వదిలివెళ్లిన ఘటన


వృద్ధుడిని తీసుకెళ్తున్న బంధువులు

దండేపల్లి: అచేతన స్థితిలో ఉన్న వృద్ధుడిని గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు రోజుల క్రితం దండేపల్లి మండలం గూడెం గోదావరి నది వంతెనకింద వదిలివెళ్లారు. ఎముకలు కొరికే చలిలో గజగజ వణుకుతూ మూలుగుతు పడి ఉన్న వృద్ధుడిని నది స్నానానికి వచ్చిన కొందరు గమనించారు. అతడితో మాట్లాడి వివరాలు తెలుసుకోగా నా పేరు మార్నేని పోచయ్య, గ్రామం ఇందారం, తనకు ఒక కుమారుడు ఉన్నాడని చెప్పాడు. అతన్ని ఇక్కడ ఎవరు వదిలి వెళ్లింది మాత్రం తెలియదన్నారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించిన వీడియోను స్థానికులు పలు వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ శనివారం సిబ్బందితో అక్కడకు చేరుకుని వృద్ధుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతన్ని మందమర్రిలోని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు

దండేపల్లి: ఓ యువకుడిని హత్యచేసిన వ్యక్తి జైలు నుంచి విడుదలై కొన్నిరోజుల తర్వాత మళ్లీ గ్రామానికి రావడంతో వివాదం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. దండేపల్లి మండలం గూడెం ఒడ్డెర కాలనీకి చెందిన రాజమౌళి గ్రామానికి చెందిన యువకుడు అనిల్‌ని ఏడాది క్రితం మద్యంలో పురుగులమందు కలిపి తాగించి హత్య చేశాడు. దీంతో రాజమౌళిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఇటీవల జైలు నుంచి విడుదలై కొద్దిరోజులు వేరే చోటు ఉంటున్నాడు. శనివారం ఒడ్డెర కాలనీలోని తన ఇంటికి వచ్చి పరిసరాలను శుభ్రం చేస్తుండగా అనిల్ తండ్రి శంకర్ గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకోగా, రాజమౌళితో తమకు ప్రాణహాని ఉందని చెప్పాడు. పోలీసులు విచారణ చేస్తుండగా శంకర్ ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేయగా అడ్డుకున్నారు. నిందితుడు కాలనీలో ఉండకూడదని, మృతుడి తండ్రితోపాటు కాలనీవాసులు డిమాండ్ చేశారు. దీంతో న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు.

పెళ్లికి వెళ్లొస్తూ.. మృత్యు ఒడికి

- డ్రైవర్ అజాగ్రత్తతో కారు బోల్తా
- అమ్మమ్మ, మనుమరాలు మృతి
- బెల్లంపల్లిలో ఘటన


ప్రమాదానికి గురైన కారు


ప్రియ మేఘన (ఫైల్)


చికిత్స పొందుతూ మృతిచెందిన కళ్యాణి

బెల్లంపల్లి: బంధువుల పెళ్లికి ఉదయం కారులో సంబురంగా వెళ్లిన ఆ కుటుంబం.. కార్యక్రమం అనంతరం ఇంటికి బయల్దేరింది. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా.. డ్రైవర్ నిర్లక్ష్యంతో కారు అదుపు తప్పి రోడ్డుపై పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా, ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి కన్నాల బస్తీకి చెందిన టింకరి.కల్యాణి(60), ఆమె కూతురు పారుపల్లి అలేఖ్య, అల్లుడు రాజేశ్, మనుమడు సాయి విక్రాంత్, మనుమరాలు ప్రియ మేఘన((9)తో కలిసి భూపాలపల్లిలో బంధువుల పెళ్లికి కారులో శుక్రవారం ఉదయం బయల్దేరి వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత అందరూ తిరిగి బెల్లంపల్లికి బయల్దేరారు. మరికొద్ది సేపట్లో ఇంటికి చేరుకునేలోపు జాతీయ రహదారి ఒక్కసారిగా కారు అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ప్రియ మేఘన అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన టింకరి కళ్యాణి మంచిర్యాలలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనలో అలేఖ్య ఆమె భర్త రాజేశ్ గాయపడ్డారు. కారు డ్రైవర్ కిరణ్‌కుమార్‌తోపాటు, అలేఖ్య కొడుకు సాయి విక్రాంత్ సురక్షితంగా ప్రమాదం నుంచి బయట పడ్డారు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది.

నిద్రమత్తే కారణం..

కారు డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. డ్రైవర్ కారును అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడంతోపాటు నిద్ర కమ్ముకు రావడంతో కారు అదుపు తప్పి బోల్తాపడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మరో పది నిమిషాలు సురక్షితంగా కారు నడిపి ఉంటే.. అందరూ క్షేమంగా ఇంటికి చేరుకునేవారని పేర్కొన్నారు. ఘటనాస్థలిని శనివారం ఉదయం బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై మహేందర్ పరిశీలించారు. అలేఖ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో కార్తికదీపాలు



బాసర: కార్తికమాసం సందర్భంగా శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శనివారం భక్తులు పూజలు చేశారు. అనంతరం మహాలక్ష్మి, మహంకాళి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు, మహిళలు.. ఓంకారం, స్వస్తిక్, దుర్గామాత వివిధ ఆకృతులతో దీపాలను వెలిగించారు.

రిమ్స్ సూపర్‌స్పెషాలిటీలో అరుదైన ఆపరేషన్


థైరాయిడ్ కణితితో బాధపడ్డ నర్సవ్వ


ఆపరేషన్ ద్వారా తొలగించిన కణితి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులు శనివారం అరుదైన ఆపరేషన్ చేశారు. అంకాలజిస్టు డాక్టర్ జక్కుల శ్రీకాంత్, ఈఎన్టీ సర్జన్ సత్యనారాయణ, అనస్తీషియా బృందం సుమారు గంటన్నర పాటు శ్రమించి ఓ వృద్ధురాలి మెడలో ఉన్న థైరాయిడ్ కణితిని విజయవంతంగా తొలగించారు. అనంతరం వైద్యుడు శ్రీకాంత్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన వృద్ధురాలు నర్సవ్వ మెడలో థైరాయిడ్ కణితితో బాధపడుతోంది. ఈనెల 11న రిమ్స్‌లో చేరగా ఈఎన్టీ సర్జన్ సత్యనారాయణ పరిశీలించారు. వైద్య పరీక్షలు నిర్వహించి థైరాయిడ్ కణితి ఉందని గుర్తించారు. బయట నుంచి అది 500 గ్రాములు కనిపించిందన్నారు. ఆపరేషన్ చేసి తీసేసరికి అది కిలోన్నర బరువు ఉందన్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సూచనతో ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు.

ఇద్దరు పోలీసులకు ప్రశంసాపత్రం


ప్రశంసాపత్రం అందుకుంటున్నరూరల్ సీఐ ఆకుల అశోక్


ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై గంగన్న

నస్పూర్/లింగాపూర్: గంజాయి కేసులో నేరస్తులకు శిక్షపడేలా చేసిన ఇద్దరు పోలీసులకు రాష్ట్ర డీజీపీ జితేందర్ అభినందించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రస్తుత మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ప్రస్తుత లింగాపూర్ ఎస్సై గంగన్న గతంలో ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నప్పుడు గంజాయి సాగు కేసులో నేరస్తులను కోర్టులో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువు చేయడంతో మేజిస్ట్రేట్.. ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించారు. ప్రశంసాపత్రం అందుకున్నవారిని సీపీ శ్రీనివాసులు, డీసీపీ భాస్కర్‌రెడ్డి, ఏసీపీ ప్రకాశ్, లింగాపూర్ పోలీసులు అభినందించారు.

అడవి కుక్కలదాడిలో జింక మృతి


జింక కళేబరం

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ అటవీ ప్రాంతంలో అడవి కుక్కల దాడిలో జింక మృతిచెందింది. శనివారం అటవీ ప్రాంతానికి వెళ్లిన గ్రామస్తులు చూసి అటవీ అధికారులకు సమాచారం అందించారు. అయితే పులి దాడిలో జింక మృతిచెందిందని గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పులి కాదని అడవి కుక్కలే జింకపై దాడి చేశాయని అధికారులు తేల్చారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

పూలే దంపతుల జయంతి, వర్ధంతిని నిర్వహించాలి


ఉత్తరాలను ప్రదర్శిస్తున్న మాలీ సంఘం నేతలు

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మా జ్యోతి బాపూలే దంపతుల జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయ ఆవరణలో శనివారం పూలే దంపతుల విగ్రహాల ముందు జిల్లా అధ్యక్షుడు వాడగురే విజయ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, కలెక్టర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులకు పోస్ట్ ద్వారా పంపే ఉత్తరాలను ప్రదర్శించారు. ఈనెల 28న జరిగే జ్యోతిబాపూలే వర్ధంతిని, వచ్చే జనవరి 3న సావిత్రీబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి హైవే వద్ద అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి పట్టుకున్నారు. వీటిని ఆర్‌కేపీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంచిర్యాల ఇసుక రీచ్ నుంచి మందమర్రి మండలానికి ఇసుక రవాణాకు ఇంకా ఆన్‌లైన్ ఓపెన్ కాలేదని అప్పటివరకు అక్రమంగా తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. అనుమతులు ఒక చోట తీసుకుని మరో చోటికి సరఫరా చేయొద్దన్నారు.